ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలి

-మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: గ్రామాల్లో ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు దృష్టి సారించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు ఎంపీపీ సుష్మశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు సుప్రజతోపాటు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మండలంలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

- ముత్తంగి డీఎస్‌కాలనీ, బచ్చుగూడెం యూపీఎస్, ఆల్విన్‌కాలనీ, పీఎస్ కంచర్ల గూడెంలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయని, కొత్త భవనాలు నిర్మించాలన్నారు. గణపతిగూడెం ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు చేయించాలన్నారు. ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, అదనపు గదులు కేటాయించాలన్నారు. పాటి స్కూల్‌లో పీఈటీని నియమించాలని పాటిసర్పంచ్ లక్ష్మణ్ కోరారు. ముత్తంగి ప్రభుత్వ పాఠశాలలో ఫర్నిచర్ కేటాయించాలన్నారు.
- రామేశ్వరంబండలో ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని, పెద్దకంజర్లలో కొత్త పోల్స్‌కు తీగలు వేయాలన్నారు. పాటిలో 100 కేవీ కావాలని, గాలి దుమారంతో కరెంట్ పోతుందన్నారు. ఇస్నాపూర్‌లోని పద్మారావునగర్, కావ్య, ఎస్‌ఎం ఆస్పత్రి వద్ద 3 ఫేజ్ లైన్ కావాలని ఎంపీటీసీ సభ్యుడు శ్రీశైలం కోరారు. రుద్రారంలో విద్యుత్ సమస్య ఉందన్నారు.
- కంజర్ల రోడ్డు అధ్వానంగా మారిందని దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ మూడు నెలల వ్యవధిలో పది ప్రమాదాలు జరిగాయని కంజర్ల సర్పంచ్ రాజు వివరించారు.
- మిషన్ భగీరథ లైన్ సరఫరాపై చర్చించారు. ఇస్నాపూర్‌లో నాలుగు ఇంచుల లైన్ వేయాలని, సంపు నిర్మించాలని ఎంపీటీసీ సభ్యుడు గడ్డం శ్రీశైలం కోరారు.
- ముత్తంగి చెరువులోకి మురుగునీరు చేరకుండా చూడాలని, పొందల కుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేస్తున్నారని, ఇస్నాపూర్ ఎర్రకుంట కబ్జా చేస్తున్నారని సభ్యులు వాపోయారు.
- తహసీల్దార్ పరమేశం మాట్లాడుతూ మండల పరిధిలో 12 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయన్నారు. ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటుమన్నారు.
- ఇస్నాపూర్, ముత్తంగి, చిట్కుల్ తదితర ప్రాంతాల్లో గంజాయి క్రయ, విక్రయాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు.

వేసవికి ముందే నీటి ఎద్దడి

పుల్‌కల్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆందోళన


మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి

పుల్‌కల్(అందోల్): మండలంలో మిషన్ భగీరథ పథకం అమలవుతున్నా వేసవి రాకముందే గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ఎంపీపీ చైతన్య విజయ్‌భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీటీసీలు రవికుమార్, దుర్గయ్య, శ్రీనివాస్‌చారి మాట్లాడుతూ.. మండల కేంద్రమైన పుల్‌కల్‌తో పాటు పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉందని ఆరోపించారు. సింగూరులో ఇన్‌టేక్ వెల్ ఉన్న పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉండడం ఏమిటని ప్రశ్నించారు. ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదని వాపోయారు. పుల్‌కల్‌లోనే ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు రావడం లేదని విమర్శించారు. తాగునీటి సరఫరా అధికారులు అందుబాటులో ఉండడం లేదన్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని, వాన మొదలు కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సర్పంచ్ శివమ్మ తెలిపారు. మూడు రోజుల నుంచి గ్రామాలు అంధకారంలో ఉన్నాయని తెలిపారు. విద్యుత్ సిబ్బందికి విన్నవించినా స్పందన లేదన్నారు. సూపర్‌వైజర్‌లు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించడం లేదని తెలిపారు. ఉద్యాన పంటలు పండించే రైతులు ఏఈఓలకు పంటల సమాచారం అందించాలని ఉద్యానవన అధికారి కీర్తి సూచించారు. 'వివరాలు అందిస్తే పంటలకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు వర్తిస్తాయని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక్ పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి తెలిపారు. సమావేశంలో పోషక్ పక్వాడా కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ చైతన్య మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధులత, పుల్‌కల్, చౌటకూర్ తహసీల్దార్ రాజయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు అధిక వేతనాలు ఇచ్చేది కేసీఆరే

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: దేశంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు అత్యధిక వేతనాలు ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నూతన పేస్కేల్ ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా నియోజకవర్గ సెర్ప్ ఉద్యోగుల ఆధ్వర్యంలో పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన కాంట్రాక్టు ఉద్యోగుల వ్యవస్థ ఉండకూడదన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టర్ ఉద్యోగులను పర్మనెంట్ చేయడంతో పాటు, లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక అభ్యున్నతిని సాధించడంలో సెర్ప్ ఉద్యోగుల పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, శ్రీనివాస్, శివకుమార్, నరేందర్, మధులత, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై నిరసన దీక్ష


నిరసన దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే

జహీరాబాద్: పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పేపర్ లీకేజీని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద టెంట్ వేసుకొని బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి పి.సుధీర్‌కుమార్, రాంచందర్ రాజనర్సింహ, కె.జనార్దన్‌రెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ భండారి, అర్చన సారడా, మల్లికార్జున్, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తే ఎంతో సంతోషపడిన నిరుద్యోగులు, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో వారి ఆశలు అడియాసలు అయ్యాయని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, హనుమంత్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జగన్, మందుల నాగరాజు, వాసు, రమేశ్, మాణిక్‌రావు, తోట చంద్రశేఖర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాచన్నస్వామి ఆలయ హుండీ లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కోహీర్(జహీరాబాద్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బడంపేట శ్రీరాచన్న స్వామి నాలుగు నెలల హుండీ ఆదాయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ సమక్షంలో సోమవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.5,88,520ల ఆదాయం వచ్చిందని తెలిపారు. హుండీలో లభించిన బంగారు వెండి ఆభరణాలను తిరిగి హుండీలోనే వేసి సీల్ చేశారు. నాలుగు లేగదూడల వేలం ద్వారా రూ.23,900ల ఆదాయం లభించింది. హుండీ, లేగ దూడల వేలం ద్వారా లభించిన మొత్తం ఆదాయం రూ.6,12,420లను స్వామివారి పేరుతో బ్యాంకులో జమచేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాణాధికారి విభూతి శివరుద్రప్ప, పాలకమండలి చైర్మన్ రాజు స్వామి, పాలకమండలి మాజీ చైర్మన్లు సోమలింగం, రాచయ్య స్వామి, పాలకమండలి సభ్యులు పాండురంగారెడ్డి, వీరేశలింగం, జగదీశ్వర్‌స్వామి, ఉపసర్పంచ్ రాజన్న, భక్తులు శివమూర్తి స్వామి, పాండు, శివకుమార్, శ్రీకాంత్, చంద్రకళ, శశికళ, అర్చకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సుజాత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆమె వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్వహించే ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కల నిర్వహణకు నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మయ్య, ఏపీఓ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దంతాలపై ప్రజలు శ్రద్ధ చూపాలి


సంగారెడ్డిటౌన్: దంతాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

సంగారెడ్డిటౌన్: దంతాలపై ప్రజలు శ్రద్ధ చూపాలని, సమస్యల బారిన పడకుండా పరిశుభ్రత పాటించాలని ఐడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓరల్ హెల్త్ డే సందర్భంగా ఎంఎన్‌ఆర్ కళాశాల వైద్య సిబ్బంది దంతాలపై ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దంతాలపై అశ్రద్ధ చూపిస్తూ సమస్యల బారిన పడుతున్నారని, నోటి సంరక్షణ ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కాపాడుకోవాలని దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ తుల్జారాం, ఎమ్మెన్నార్ డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్వీ రవీంద్ర, డాక్టర్ సందీప్, డాక్టర్ శిల్ప, డాక్టర్లు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): సమాజంలోని ప్రతి వ్యక్తి నోటి ఆరోగ్యంపై తప్పనిసరిగా దృష్టి సారించినట్లయితే దంతాలు, చిగుళ్లు, నాలుక, వంటివి బాగుండి ఎటువంటి జబ్బులు రావని ఎంఎన్‌ఆర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్, రవీందర్ విద్యార్థులకు సూచించారు. సోమవారం పట్టణంలోని సెయింట్ ఆంథోనిస్ పాఠశాలలో ఎంఎన్‌ఆర్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో 15 మంది వైద్యులు విద్యార్థులకు నోటి పరీక్షలు నిర్వహించారు. నోటి పరీక్షలు నిర్వహించిన అనంతరం డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నోటి, దంత శుభ్రతలను పాటించాలని లేకపోతే నోటి దుర్వాసన ఏర్పడి రోగాల బారినపడే ప్రమాదం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మజీద్, ఈద్గాల వద్ద సౌకర్యాలు కల్పించాలి


ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న షేక్ గౌస్‌పాషా తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): రంజాన్ మాసంలో పట్టణంలోని మజీద్, ఈద్గాల వద్ద ముస్లింలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎంఐఎం అధ్యక్షుడు షేక్ గౌస్ పాషా అన్నారు. సోమవారం పట్టణ ఎంఐఎం అధ్యక్షుడు గౌస్ పాషా ఆధ్వర్యంలో మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులకు వేర్వురుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం సందర్భంగా పట్టణ పరిధిలోని 26 వార్డుల్లోని వీధులన్నీ శుభ్రంగా ఉంచాలని, మజీద్‌ల దగ్గర మురుగు నీటి కాల్వను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేయించాలని కమిషనర్ ఎన్, కృష్ణారెడ్డిని కోరారు. పట్టణంలో దుకాణాలు, హోటళ్లను తదితర వ్యాపార దుకాణాలను తొందరగా మూసివేయించొద్దని ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుద్దుస్, సయ్యద్ అర్షద్, అబ్దుల్ రహీమ్, మొహిజ్ పటేల్, ముతలిబ్, హుసేన్, అర్షద్, అప్రోజ్, మజ్హర్, తస్కీన్, అలీమ్, జమీల్, జహంగీర్, విఖార్, ఫెరోజ్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

సదాశివపేట(సంగారెడ్డి): ఎంఆర్‌ఎఫ్ కార్మికులకు మంచి వేతన ఒప్పందం, సర్వీస్ అలవెన్స్‌లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రిటైర్మెంట్ వయస్సు 60 సంవత్సరాలకు పెంపునకు కృషి చేస్తామని కేపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలో గొల్లకెరీ కూడలి వద్ద కేపీఎస్, బీకేఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లతో చర్చించి కార్మికుల సంక్షేమానికి నిరంతరం పాటుపడతామన్నారు. కార్యక్రమంలో కేపీఎస్ నాయకులు బోనకుర్తి మల్లేశం, నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, శివరాం, జనార్దన్, అంజయ్య, విట్టల్, శ్రీనివాస్‌చారి, పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డిటౌన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఔత్సాహిక చేనేత కళాకారుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకురాలు విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కళాకారులు 31 డిసెంబర్, 2022 వరకు 30 సంవత్సరాల వయసు కలిగి, చేనేత రంగంలో 10 సంవత్సరాల అనుభవం గలవారు అర్హులని, చేనేత డిజైనర్లకు 31 డిసెంబర్ 2022 వరకు 25 సంవత్సరాల వయస్సు కలిగి, చేనేత డిజైన్స్ రంగంలో ఐదు సంవత్సరాల అనుభవం గల వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల ఔత్సాహికులు నిర్ణీత దరఖాస్తు ఫారంలో పూర్తి వివరాలను నింపి, నైపుణ్యతను చాటే నమూనాలను(శాంపిల్స్) సంగారెడ్డి కలెక్టరేట్‌లోని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో ఏప్రిల్, 15లోగా సమర్పించాలని ఆమె సూచించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కంది(సంగారెడ్డి): వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులతో కలిసి ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణగౌడ్ పరిశీలించారు. సోమవారం మండల పరిధిలోని ఎద్దుమైలారం గ్రామంలో అకాల వర్షంతో దెబ్బతిన్న వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణగౌడ్ మాట్లాడుతూ పంటనష్టం వివరాలను అంచనా వేయించి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం రైతులకు అందేలా చూడాలన్నారు. మండల వ్యవసాయాధికారి చైతన్య మాట్లాడుతూ వడగళ్ల వానతో పంటలకు మండలంలో కొంతమేర నష్టం వాటిల్లిందన్నారు. మడులలో నీరు నిల్వ కుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పంటనష్టం మంజూరు చేయాలి

మునిపల్లి(అందోల్): ఇటీవల పడిన వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న కుసుమ, జొన్న పంటలతో పాటు తదితర పంటలకు పంట నష్టపరిహారం మంజూరు చేయాలని ఆయా గ్రామాల రైతులు బోయిని శ్రీనివాస్, సంగయ్య, నర్సింలు, విఠల్, మోహన్‌తో పాటు తదితరులు సంబంధిత అధికారులను సోమవారం కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెటల్‌కుంటలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.15లక్షలు నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను సర్పంచ్ పీటర్ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థిక సాయం**

జిన్నారం(పటాన్‌చెరు): మండలపరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన గౌరమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఎమ్మెల్యే సోదరుడు, బీఆర్‌ఎస్ నేత గూడెం మధుసూధన్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆ నగదును స్థానిక నేతలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

◆ **వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ**

నారాయణఖేడ్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద విధానాలను ప్రజల్లో ఎండగడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈనెల 24న నిజామాబాద్‌లో ప్రారంభించనున్న జనచైతన్యయాత్రకు సంబంధించి వాల్‌పోస్టరుల్‌ సోమవారం ఖేడ్‌లో ఆవిష్కరించారు. చిరంజీవి కొటారి నర్సింలు, ప్రవీణ్, అంజాగౌడ్, సంజీవ్ పాల్గొన్నారు.

◆ **కేటీఆర్ బాధ్యత వహించాలి**

నారాయణఖేడ్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప డిమాండ్ చేశారు. ఖేడ్ రాజీవ్‌చౌక్‌లో సోమవారం మా నౌకరీలు.. మాకు కావాలే అనే నినాదంతో నిరసనదీక్ష నిర్వహించారు. పార్టీ ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, సీనియర్ నాయకులు మారుతిరెడ్డి, సాయిరాం, సుధాకర్, సతీష్, రమేష్ యాదవ్, పట్నం మాణిక్యం, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌సాగర్, శివ తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్య సామగ్రి అందజేత**



నారాయణఖేడ్: మండలంలోని రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీసత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో మానవసేవే మాధవసేవ అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు పరీక్ష సామగ్రిని శ్రీసత్యసాయి సేవాసంస్థ జిల్లా కన్వీనర్ శంకరప్ప అందజేశారు. సర్పంచ్ సువర్ణ ప్రభాకర్, హెచ్‌ఎం రవీందర్, పాఠశాల యాజమాన్యకమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **ఎల్‌ఓసీ పత్రాల అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్‌కు చెందిన తిరుపతిరెడ్డికి గుండె ఆపరేషన్ అయ్యింది. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2.50లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, గోపాలమ్మతోపాటు నాయకులు వరప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.,

◆ **ఘనంగా పాఠశాల వార్షికోత్సవం**

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ సుగుణమ్మ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు విజయమోహన్‌రెడ్డి, హెచ్‌ఎం మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

◆ **రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు**

నారాయణఖేడ్: మండలంలోని హన్మంత్‌రావుపేట్‌లో బుధవారం నుంచి ఈనెల 27 వరకు ఉగాది, వెంకటేశ్వరస్వామి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ **పంచాంగ శ్రవణ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ**

పటాన్‌చెరు టౌన్: ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఈనెల 22వ తేదీన పట్టణంలోని చైతన్యనగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో పంచాంగ శ్రవణం ఉంటుంది. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికను సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **24 నుంచి హాల్‌టికెట్ల పంపిణీ**

మునిపల్లి(అందోల్): పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 24 నుంచి హాల్ టికెట్లను పంపిణీ చేస్తామని ఎంఈఓ దశరథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 13 వరకు పదో తరగతి పరీక్షలుంటాయని తెలిపారు.

◆ **ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం**

జిన్నారం(పటాన్‌చెరు): కానుకుంట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న బీరప్ప దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ సోమవారం రూ. లక్ష విరాళం నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలమ్మ, నాయకులు అంజోద్‌ఖాన్, వెంకటేశ్, యాదగిరి, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ **నడిరోడ్డులో విగ్రహం వద్దు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ముఖద్వారం వద్ద నడిరోడ్డులో శివాజీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని, దాని వల్ల వాహనదారులు ఇబ్బందులు పడతారని కౌన్సిలర్లు మయూరి రాజుగౌడ్, రాంసింగ్‌లు అన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వారు ఫిర్యాదు చేశారు. విగ్రహం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని మంచి స్థలాన్ని చూసి ఏర్పాటు చేస్తే అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

◆ **సీసీ కెమెరాలు ప్రారంభం**



కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మారేపల్లిలో సోమవారం కొండాపూర్ ఎస్సై వెంకటేశం సీసీకెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చోరీల నియంత్రణలో సీసీకెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఒక సీసీకెమెరా వందమంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. సర్పంచ్ వెంకటేశంగౌడ్ మాట్లాడుతూ.. దాతల సహకారంతో గ్రామంలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద 22 సీసీకెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **బస్టాండ్ అభివృద్ధికి చర్యలు**



కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గుంతలు పడి వాహనాలు నిలిపేందుకు ఇబ్బందులు పడున్నందున బస్టాండ్‌లోని స్థలం చదును చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు ఖేడ్ డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. కంగ్టికి వచ్చి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జ్ పాండు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **ఘనంగా నూతన పంచాంగం ఆవిష్కరణ**

కంగ్టి(నారాయణఖేడ్): తెలుగు నూతన సంవత్సరం శ్రీశోభాకృత్ నామ సంవత్సర పంచాంగం సోమవారం బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు, ఖేడ్ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రావు, కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు, కిషన్‌రావు, సతీష్, నారాయణరావు పటేల్, గౌరవ అధ్యక్షుడు కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

◆ **భక్తి మార్గమే ముక్తికి సోపానం**

కంగ్టి(నారాయణఖేడ్): భక్తి మార్గమే ముక్తికి సోపానమని కర్ణాటకలోని మోఘుల్‌కోడ్ సంస్థానాధిపతి మురుగు రాజేంద్ర శివయోగి తెలిపారు. సోమవారం మండల కేంద్రం కంగ్టిలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక చింతనలో ఆయన మాట్లాడారు. రాజేంద్ర శివయోగికి కంగ్టిలో తులాభారం, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన అనుగ్రహ భాషణం చేశారు.

◆ **కల్యాణ మంటపం పనుల పరిశీలన**

నారాయణఖేడ్: ఖేడ్ శ్రీరామమందిరం ఆవరణలో దాతలైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్ షెట్కార్‌తో పాటు ఆయన సోదరుల కుటుంబీకుల సహకారంతో కల్యాణ మంటపం నిర్మిస్తున్నారు. సోమవారం వారు మంటపాన్ని పరిశీలించారు. వారివెంట ఆలయకమిటీ బాధ్యులు హన్మాండ్లు సేట్, వివేకానంద్, పాండు, మారుతిరెడ్డి, సంజీవ్‌పటేల్, బస్వరాజ్, దత్తు, పండరి పాల్గొన్నారు.

◆ **మల్లికార్జున స్వామి జాతర**

జిన్నారం(పటాన్‌చెరు): మండలపరిధిలోని కొడకంచిలో మల్లికార్జున స్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. చిట్కుల్ సర్పంచ్ నీలం మధు దేవాలయం వద్ద నీటి సమస్యను పరిష్కరించేందుకుగాను రూ. 2.50లక్షలతో నీటి బోరును వేయించారు. ఈ బోరును ఆయన ప్రారంభించారు.

◆ **పంటనష్ట పరిహారం ఇవ్వాలి**



కంగ్టి(నారాయణఖేడ్): అకాల వర్షంతో పాటు వడగళ్లు కురవడంతో జిల్లాలో రైతులు వేసిన పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం పంట నష్ట పరిహారం వెంటనే ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప జన్‌వాడే డిమాండ్ చేశారు. కంగ్టి మండలంలోని ముర్కుంజాల్ గ్రామ శివారులో సోమవారం నేలకొరిగిన మొక్కజొన్న, జొన్న పంటలను ఆయన పార్టీ నాయకులతో పాటు పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజనికాంత్, సీనియర్ నాయకులు సాయిరాం, దత్తాత్రి, పండరి, గోపాల్‌రెడ్డి, రమేశ్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

◆ **అంధత్వ నిర్మూలనే లక్ష్యం**



సదాశివపేట(సంగారెడ్డి): సంపూర్ణ అంధత్వ నిర్మూలనకే ప్రభుత్వం కంటి వెలుగు పథకం ప్రారంభించినట్లు కౌన్సిలర్ రేష్మ మొబిన్ అన్నారు. సోమవారం పట్టణంలోని 21వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ సంయుక్త కార్యదర్శి మొబిన్, నాయకులు సతాని శ్రీశైలం, వార్డు అధ్యక్షుడు కాజాఖాదీర్ అబ్దుల్, వైద్యులు, వార్డుప్రజలు పాల్గొన్నారు.

◆ **రుణాలను వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలి**

జోగిపేట(అందోల్): సొసైటీలో తీసుకున్న రుణాలను వన్‌టైం సెటిల్ మెంట్ కింద చెల్లించేలా అవకాశం కల్పించాలని రైతులు రాజిరెడ్డి, ఆడివయ్య, రాములులు కోరారు. సోమవారం అందోలులోని సొసైటీ భవనంలో బకాయిలు ఉన్న రైతులతో రికవరీ స్పెషల్ ఆఫీసర్ ఇస్తార్ రాణి సమావేశాన్ని నిర్వహించారు. సొసైటీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు సకాంలో చెల్లించాలని కోరగా రైతులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. రైతులు తీసుకున్న రుణాలకు ప్రభుత్వం మూడు రకాల వడ్డీలను వసూలు చేస్తుందని రైతులు ఆరోపించారు.

◆ **ఉద్యోగ భద్రత కల్పించాలి**

సంగారెడ్డిటౌన్: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు పర్మనెంట్ చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా జాక్ అధ్యక్షుడు మధురనేని శేషాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలో డీఈఓ రాజేశ్‌తో పాటు ఆర్జీఏ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ.. ఉద్యోగులకు వేతనాలు పెంచడంతో పాటు మినిమమ్ పేస్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎస్‌ల సంఘం అధ్యక్షుడు విక్టర్‌రాజ్, సీఆర్పీల జిల్లా అధ్యక్షుడు దత్తు, కేజీబీవీ ఉద్యోగులు సంగీత, స్వప్న, ఉమాదేవి, తిరుమల సీఆర్పీలు యాదగిరి, రమేష్, సురేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.